క్లుప్తంగా

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు



డీఎస్పీ కె.వి.మహేష్

కర్నూలు:పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని అతిక్రమించరాదని కర్నూలు డీఎస్పీ కె.వి. మహేష్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి ఒకరిని ఇబ్బంది పెట్టే విధంగా, కించపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టిన, మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గురువారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించారు. సాధారణ ఎన్నికలు కూడా త్వరలో రానున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ప్రత్యర్థులను రెచ్చగొట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకోవాలని రాజకీయ పార్టీలకు సూచించారు.

యోగా శిక్షకుడికి అవార్డు



యోగాచార్య అవార్డు అందుకుంటున్న అవినాష్ శెట్టి

కర్నూలు (టౌన్): కర్నూలు నగరానికి చెందిన యోగ శిక్షకుడు, జిల్లా యోగ సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టికి యోగచార్య అవార్డును బహూకరించారు. బెంగళూరులో జరుగుతున్న 1వ అంతర్జాతీయ యోగా ఫెస్టివల్‌లో భాగంగా గురువారం ఏసీపీ నారాయణ స్వామి, సీఎఫ్ఏ విజయ్‌కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అవినాష్‌కు అవార్డు రావడంపై జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

గాడ్గే బాబా జీవితం యువతకు ఆదర్శం



గాడ్గేబాబా చిత్ర పటం ముందు నివాళి అర్పిస్తున్న రజక నేతలు

కర్నూలు(అర్బన్): స్వచ్ఛ్ భారత్ సృష్టి కర్త సంత్ గాడ్గే బాబా జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని రజక ఐక్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వేంపెంట రాంబాబు అన్నారు. గురువారం గాడ్గేబాబా 147వ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి రజక నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. గాడ్గే బాబా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఆలూరు బలరామ్, వాడాల నాగరాజు, మాలంగిరి గణేష్, చంద్రశేఖర్, మధు, రమణ, భారతీ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ...

గాడ్గేబాబా జయంతి వేడుకలను స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక కార్యాలయంలో కూడా నిర్వహించారు. గాడ్గేబాబా చిత్ర పటానికి వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని ఊరూరా పశుగ్రాసం, మినీ గోకులాలకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఊరూరా పశుగ్రాస కేంద్రాలు, మినీ గోకులాలను నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలో 7 వేల ఎకరాల్లో 5 వేల మంది రైతులు పశుగ్రాసం పెంచారన్నారు. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వాటి పెండింగ్ నిధులను విడుదల చేయడంలేదన్నారు. కార్యక్రమంలో కృష్ణ, నరసింహులు, నాగరాజు, మహేష్, కుళ్లాయప్ప, వెంకటేశ్వర్లు, జనార్దన్‌రెడ్డి, కాశీం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్: పఠాన్,యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ,సెల్ఫీ, కోనసీమ థగ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, సార్, కోనసీమ థగ్స్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్: యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్,కొక్కైన్ బీర్, అలా మొదలైంది
భరత్ కాంప్లెక్స్ : పఠాన్, మేఖేల్, షెహ్జాదా
రాజ్ : మిస్టర్ కింగ్
శ్రీరామ: డెడ్‌లైన్
విజయ: సార్

హస్తకళా.. ఆకృతులు భళా

- లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియంలో గిఫ్ట్ ఆర్టికల్స్, హౌస్ డెకరేషన్స్, తదితర వస్తువులు లభ్యం
- వచ్చే నెల 12 నుంచి 26 వరకు హస్తకళల ప్రదర్శన, మార్కెటింగ్





లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియంలోని హస్త కళా వస్తువులు

కర్నూలు(అగ్రికల్చర్): కొండారెడ్డిబురుజు దగ్గర ఉన్న లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం జిల్లా ప్రజలకు, ముఖ్యంగా నగరవాసులకు సుపరిచితమే. ఇక్కడ ఎన్నెన్నో గిఫ్ట్ ఆర్టికల్స్, హౌస్ డెకరేషన్స్, సీనరీస్ రకరకాల కళాకృతులు కనువిందు చేస్తున్నాయి. దేశంలో చేతులతో తయారు చేసిన అపురూపమైన చిత్రాలు, విగ్రహాలు, రాగి, ఇత్తడి వస్తువులు, పింగాణి వస్తువులు, దేవతామూర్తుల విగ్రహాలు, చేనేత వస్త్రాలు ఇలా ఎన్నో రకాల అద్భుతమైన వస్తువులకు లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియం నిలయంగా మారింది. వీఐపీలు, వీవీఐపీలు వచ్చినా... ఉద్యోగులు, అధికారులు పదవీ విరమణ చేసినా... నూతన గృహ ప్రవేశాలు జరుగుతున్నా... ఇలా ఎటువంటి కార్యక్రమం జరిగిన గిఫ్ట్ ఆర్టికల్ కొనుగోలు చేసేందుకు చాలామంది వెళ్లేది ఇక్కడికే. లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్ ఎంపోరియం రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ. ఇది ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌క్రాఫ్ట్ కార్పొరేషన్(ఏపీహెచ్‌డీసీ) ఆధ్వర్యంలో పని చేస్తుంది. ఇక్కడ రూ.30 విలువ మొదలుకొని రూ.5 లక్షల విలువ చేసే వస్తువుల వరకు లభ్యం అవుతాయి.

1982లో ఏర్పాటు...

చేతివృత్తుల వారి సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ పనిచేస్తోంది. లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్ ఎంపోరియం ద్వారా హస్తకళావస్తువులకు మార్కెటింగ్ చేస్తోంది. 1982లోనే లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియం ఏర్పాటు అయింది. అయితే 1990లో దీనిని మూసివేశారు. తిరిగి 2004లో ప్రారంభించారు. ఇక్కడ కొనుగోలు చేసిన వస్తువుల విలువను బట్టి 5 నుంచి 10 శాతం డిస్కౌంటు ఇస్తారు. ఇది ప్రభుత్వ రంగ సంస్థ అయినందున మోసం, దగా వంటి వాటికి అవకాశం లేదు. కచ్చితమైన ధరలకే లభిస్తాయి. కాగా హస్తకళ, చేనేత వస్తువులకు మరింత మార్కెటింగ్ సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో వచ్చే నెల మార్చి 12 నుంచి 26 వరకు వైఎంసీఏ ప్రాంగణంలో హస్తకళల ప్రదర్శన, మార్కెటింగ్ కోసం ఎగ్జిబిషన్ చేపడుతోంది. ఇందులో దేశవ్యాప్తంగా ఎంతో పేరుపొందిన కొండపల్లిబొమ్మలు, బంజారా క్రోచెట్‌లెస్, ఏటికొప్పాక బొమ్మలు, వైట్ మెటల్ బొమ్మలు, స్టోన్‌వేర్ ఫొటోఫ్రేములు, రోజ్‌వుడ్ బొమ్మలు, వెల్‌వెట్‌కార్పెట్లు, బ్లాక్ మెటల్ క్రాఫ్ట్స్, లెదర్ లాంప్ షేడ్స్ తదితర అనేక హస్తకళాకృతులు ప్రదర్శనలో ఉంచనున్నారు.

హస్తకళలకు ఆదరణ పెరుగుతోంది



నేడు హస్తకళలకు ఆదరణ పెరుగుతోంది. కర్నూలులోని లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్ ఎంపోరియంలో అనేక రకాల బొమ్మలు, దేవతామూర్తుల విగ్రహాలు, రాగి, ఇత్తడి వస్తువులు, చేనేత వస్త్రాలు ఇలా అనేకం లభిస్తాయి. గిఫ్ట్ ఆర్టికల్స్, హౌస్ డెకరేషన్స్, దేవతల బొమ్మలు, విగ్రహాల కోసం అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తారు. మార్చి 12 నుంచి 26 వరకు హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

–తిమ్మయ్య, మేనేజర్, లేపాక్షి హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎంపోరియం, కర్నూలు

భక్తిశ్రద్ధలతో హయగ్రీవ ఇష్టి



బుర్రకథాగానం చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం హయగ్రీవ ఇష్టి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ద్వారతోరణ ధ్వజ, ఘృతకుంభాభిషేకం, బాలభోగ నివేదన, విష్ణు సహస్రనామ పారాయణం, జలాధివాసం తదితర కార్యక్రమాలు జరిగాయి. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు గరిమెళ్ల సత్యవతి, గరిమెళ్ల సీతామహాలక్ష్మి, గరిమెళ్ల అంజనీదేవిల బుర్రకథాగానం అలరించింది. కార్యక్రమంలో గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, ఇల్లూరి రామయ్య, బాలసుధాకర్, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ మల్లు వెంకటరెడ్డి, గోకులం పరివారం పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల సంరక్షణకు కృషి



ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌ను కలసి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లా పరిధిలోని వక్ఫ్ ఆస్తుల సంరక్షణకుచర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం అంజుమన్ ఎ ఇస్లామియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని డాక్టర్ అబ్దుల్ యునాని ఆసుపత్రి మెడికల్ కళాశాల,ది ఇస్లామియా అరబిక్ డిగ్రీ కళాశాల, ఉమర్ అరబిక్ హైస్కూల్, ఉమర్ అరబిక్ ప్రైమరీ స్కూల్, ఉర్దూ పాఠశాలలకు సంబంధించిన స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు. కమిటీ సభ్యులు కొందరు వక్ఫ్ చట్టాన్ని ఉల్లంఘించినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంజుమన్ ఎ ఇస్లామియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అండ్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ కన్వీనర్ అయూబ్ అలీ ఖాన్, కమిటీ సభ్యులు జంషీద్ అలీ ఖాన్, మనూర్ అహ్మద్, జహంగీర్, సాహెబ్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగులపై ఒత్తిడి ఆపాలి



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

కర్నూలు(రాజ్‌విహార్): పోస్టల్ ఉద్యోగులపై రోజురోజుకు పెరుగుతున్న ఒత్తిళ్లు ఆపాలని ఎన్ఎఫ్‌పీఈ డివిజనల్ సెక్రటరీ గిరిబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని టార్గెట్లు ఇచ్చి వాటిని పూర్తి చేయాలని అధికారులు ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగులు మానసికంగా ఆందోళనకు గురై అనారోగ్యపాలవుతున్నారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఈశ్వరయ్య, శమంతకరెడ్డి, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

8న 'నీ గానమే నా ప్రాణం'

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఫాల్గుణ మాసం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో మార్చి 8న 'నీ గానమే నాప్రాణం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు కేఈప్రతాప్,హరినారాయణ గురుస్వామి తెలిపారు. స్థానిక సప్తగిరినగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా 12 గంటల పాటు అఖండ భజన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భజన బృందాలు భజనలో పాల్గొంటారని పేర్కొన్నారు. కాషాయ ధ్వజారోహణ, గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, సాయంత్రం 6.30 గంటలకు మహాపడి పూజ జరుగుతాయని తెలిపారు.

గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయండి

- భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, భూ హక్కు పత్రాల పంపిణీ, స్పందన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని జిల్లాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, అందుకు కారణాలను సంబంధిత కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు సంబంధించి విలేజ్ సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వీర్వోల లాగిన్‌లో డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో డ్రోన్ సర్వే చేసే ముందు డ్రోన్ కంట్రోలర్ పాయింట్‌ను, మార్కులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.గ్రౌండ్ ట్రూతింగ్ చేసిన తరువాత 9(2), 10(2) నోటీషులను రైతులకు ఇచ్చి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. అలాగే క్యూఆర్‌ఐ మ్యాపులు వచ్చిన తరువాత సెక్షన్ 13 కింద నోటిఫికేషన్ ఇవ్వడానికి ఎంత సమయం పడుతుందని అధికారులను అడగా 90 రోజుల్లో పనిని పూర్తి చేయవచ్చని కలెక్టర్లు వివరించారు. కార్యక్రమంలో సర్వే ఏడీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహాలను పరిశీలించనున్న న్యాయమూర్తులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదిరత వసతి గృహాలను రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తులు పరిశీలించే అవకాశాలు ఉన్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి తెలిపారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పలు వసతి గృహాలను సందర్శిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తులు జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించనున్నారని చెప్పారు. జిల్లాలోని వసతి గృహ సంక్షేమాధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా వసతి గృహాలను చక్కగా ఉంచుకోవాలన్నారు. హాస్టళ్ల పరిసరాలతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ పాటించడంతో పాటు రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు.

తలసీమియా చిన్నారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ప్రతి ఒక్కరూ తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులను ఆదుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి చెప్పారు. కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ తలసీమియా సేవా పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి మాట్లాడుతూ తలసీమియాతో బాధపడుతున్న చిన్నారుల జీవనం ఆవేదనాభరితమని, ఇలాంటి చిన్నారులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. సొసైటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు రూ.10వేలు పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ జనరల్ సెక్రటరీ జి.సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీ జి.మద్దిలేటి, సభ్యులు మక్బూల్, మద్దమ్మ, రమేష్, గిరిజ, శ్రీలత, శివనాగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ జొనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు

- ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించండి
- ప్రతి ఇంటికి వెళ్లి పరిచయం చేసుకోండి
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం స్థానిక రాయల్ ఫంక్షన్ హాలులో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల కోసం సిఫార్సులు, కమీషన్లు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా మంజూరు చేసే ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. ఏ పథకం అయినా కుల మతాలు, రాజకీయాలు చూడకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ ఆచరణలోనూ అదే చూపిస్తున్నారని పేర్కొన్నారు. పథకాల కోసం ప్రజలు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పథకాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వలంటీర్లను ఇంటింటికి పంపించి పథకాల గురించి చెప్పడంతో పాటు అర్హత ఉంటే ఇంటి వద్దే దరఖాస్తు చేయిస్తున్నారన్నారు. ముఖ్యంగా వార్డు కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి పరిచయం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలు, చేయనున్న మంచి కార్యక్రమాలతో పాటు జగనన్న అందించిన పథకాలను వివరించాలన్నారు. మూడున్నరేళ్ల పాలనలోనే 98శాతం హామీలు అమలు చేసిన ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాబోవు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఇతర పార్టీలకు స్థానం లేకుండా చేదయంలో కీలకపాత్ర పోషించాలని వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సీ.హెచ్ మద్దయ్య, ఆదిమోహన్‌రెడ్డి, రైల్వే ప్రసాద్, కేదార్‌నాథ్, ఫిరోజ్, ఆసిఫ్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పీసీ సర్కార్ జయంతి



పీసీ సర్కార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతి వేడుకలు గురువారం ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంద్రజాలికుడు చాంద్ బాషా ప్రదర్శించిన ఇంద్రజాలం ఆకట్టుకుంది. కేడీజీ బాలు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమారి, సీనియర్ ఉపాధ్యాయులు ఇనాయతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ఓల్డ్‌సిటీలోని హరిజన వాడ, బుధవారపేటలోని జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుశీల నేత్రాలయ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు సుధాకర్‌రావు కంటి పరీక్షలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ మాట్లాడుతూ 120 మందికి ఉచితంగా పరీక్షలు చేయించామన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించి అద్దాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మ ప్రసార్ కన్వీనర్ అనంత విశ్వప్రసాద్, నగర అధ్యక్షులు మద్దిలేటి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● 28న గాడిచెర్ల వర్ధంతి

కర్నూలు కల్చరల్: గాడిచెర్ల ఫౌండేషన్, కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ, ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని శ్రీ సర్వోత్తమ భవనంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 63వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి రావి శారద గురువారం తెలిపారు.

● నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్): రంగారెడ్డి కోర్టు న్యాయవాది సురేందర్‌పై జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ శుక్రవారం కర్నూలు జిల్లా న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.కృష్ణ, కాటం రంగడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తులు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్య చదువుతూ మధ్యలోనే ఆపివేసిన విద్యార్థులకు ఓపెన్ ద్వారా ఇంటర్ పూర్తి చేసేందుకు ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వ జూనియర్ (మైనార్టీస్)కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. www. apopenschool. ap. gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



అనుగొండ గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం డీఎల్‌డీఓ స్థానిక ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి మండలంలోని లద్దగిరి, అనుగొండ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అదేవిధంగా గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేసి ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్ కార్డులివ్వాలని, సున్నా నుంచి 5 సంవత్సరాల పిల్లలకు బాల ఆధార్ పూర్తి చేసి ఎస్‌డీజీ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. స్పందన ద్వారా వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న బాలబాలికలు, గర్భవతులను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం, మందులివ్వాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న అమ్మఒడి, కల్యాణమస్తు, షాదీతోఫాపై ప్రజలకు వలంటీర్లు అవగాహన కల్పించి అర్హులకు అందేలా చూడాలని డీఎల్‌డీఓ సూచించారు.

ఆలయ భూముల కౌలుకు వేలంపాట

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలోని శ్రీ కేశవ, నాగలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూములను కౌలు ప్రతిపాదికన ఇచ్చేందుకు గురువారం ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్విరెడ్డి బహిరంగ వేలంపాట నిర్వహించారు. స్థానిక దేవాలయంలో నిర్వహించిన వేలంలో ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. ఆలయానికి సంబంధించి సర్వే నంబర్లు 81 నుంచి 93, 262లో ఉన్న మొత్తం 27 ఎకరాల భూమి కౌలుకు బోయ గుడిసె శివ రూ.1.36 లక్షలు, దస్తగిరి రూ.36 వేలు, కుమార్ రూ.41 వేలు చొప్పున ముగ్గురు వ్యక్తులు రూ.2.08 లక్షలకు పాడి భూములను దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

కోడుమూరు: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు, ఎరువులను వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని పులకుర్తి రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు రైతులతో సమావేశమయ్యారు. శనగ సాగు చేసిన రైతులు మార్కెట్‌లో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు తమ దిగుబడులను అమ్ముకోవాలన్నారు. అనంతరం కోడుమూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అభినందనీయం

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అభినందనీయమని రాష్ట్రీయ బాల స్వాస్థ్య సమన్వయకర్త హేమలత అన్నారు. గురువారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల వల్ల రక్తహీనత సమస్య రాదని సూచించారు. కిశోర బాలికలలో నెలసరి ఉంటుందని, అలాంటి వారు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.